# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 05 అక్టోబర్ 2025


## ప్రజల రక్షణే లక్ష్యం

### శక్తి టీమ్స్‌తో విస్తృత అవగాహన కార్యక్రమాలు..



**రాయచోటి అక్టోబర్ 04 ప్రభాతవార్త :**
జిల్లాలో ప్రజల భద్రత, ముఖ్యంగా మహిళలు, యువత రక్షణ కోసం జిల్లా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా శక్తి టీమ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు జరిగాయి. పోలీసులు ప్రధానంగా సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ఫలితాలు, మహిళా భద్రతపై దృష్టి సారించారు. ఆర్థిక లావాదేవీల పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్, మెసేజ్‌లు, ఓటీపీ, ఏపీకే ఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సూచించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే తీవ్ర నష్టాలను వివరించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాద సమయాల్లో తక్షణ సహాయం అందించే శక్తి యాప్ ప్రాముఖ్యతను, దాని వినియోగాన్ని వివరించారు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోవడానికి శక్తి టీమ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. అత్యవసర సహాయం కోసం 100, 112, 1930 హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.



పూర్తి సామర్థంతో పింఛ ప్రాజెక్టు నిండుకుండలా

# ప్రజా సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న మంత్రి సవిత



ఆటో నడుపుతున్న ఇంచార్జి మంత్రి సవిత



ఆటో డ్రైవర్‌కు చెక్ అందిస్తున్న మంత్రి సవిత, బిటెక్ రవి

**పులివెందుల, అక్టోబర్ 4, ప్రభాతవార్త:**
ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం పులివెందులలో మంత్రిఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పులివెందుల పట్టణం నడివీధులలో ఆటో డ్రైవర్లతో తెలుగుదేశం తో పాటు కూటమి నాయకులు పాల్గొని ఆర్డిఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కడపజిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత , కడపజిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ , జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ,పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, తుంగభద్ర ప్రోజెక్టు హైలెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పాల్గొని డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ,కూటమి ప్రభుత్వంగా రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. 2024 ఎన్నికలలో భాగంగా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతోపాటు, మరికొన్ని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ హామీలన్నింటిని దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేసి రాష్ట్ర ప్రజల మన్ననలను అందుకోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించి ఒకపక్క అమరావతి నిర్మాణం, మరోపక్క ప్రజల క్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వారు ముఖ్యమంత్రిని కొనియాడారు. అలాగే రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు సమాజానికి సేవకులు. వారి జీవన ప్రమాణాలు పెంచే దిశగా ఈ పథకం ఒక చారిత్రాత్మక అడుగు" అని అన్నారు.అలాగే ఆటో డ్రైవర్లకు ఆరోగ్య బీమా, పిల్లల విద్యా సాయం, వాహన మరమ్మతులకు సబ్సిడీ వంటి సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని వారు తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి భరోసా కలిగించేలా ఈ పథకం అమలు చేస్తారన్నారు అనంతరం జిల్లాలోని ఆటో యజమాలకు ఆటో యజమానులకు 17 కోట్ల, 18లక్షల.40 వేల రూపాయల చెక్కు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేల పార్థసారధి రెడ్డి, శేషారెడ్డి, పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఇతర అధికారుల తో పాటు, టిడిపి నాయకులు కార్యకర్తలు, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

## జల సవ్వడితో జిల్లాలో ప్రాజెక్టులు కళ కళ

పింఛా ప్రాజెక్ట్ నుంచి 6412 క్యూసెక్కుల నీరు విడుదల

కడప జిల్లాలో జలాశయాల పూర్తి

నిల్వ సామర్థం 84.167 టిఎంసిలు

ప్రస్తుత నీటి నిల్వ సామర్థం 66.32 టీఎంసీలు



12 టీఎంసీల నీటి నిల్వతో నిండుకుండలా బ్రహ్మసాగర్ ప్రాజెక్టు

**రాజంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త**
ఉమ్మడి కడప జిల్లాలో రిజర్వాయర్లు జల సవ్వడితో కలకలాడుతున్నాయి.కృష్ణా జలాలు దాదాపు అన్ని ప్రాజెక్టులను నిండుకుండలా చేశాయి. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి దాదాపు నెల రోజులపాటు ప్రతిరోజు ఒక టీఎంసీ నుంచి మూడు సిఎంసిల నీరు పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా రావడంతో అన్ని ప్రాజెక్టులకు జలకల సంతరించుకుంది. ప్రధానంగా కృష్ణా జలాల ఆధారంగా నిర్మించిన అన్ని ప్రాజెక్టులు ఆయకట్టు రైతాంగానికి ధీమా ఇస్తున్నాయి. ఈ రబీ సీజన్లో పంటలు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కెసి కెనాల్ కింద ఇప్పటికే వరి నాట్లు ఊపందుకున్నాయి. జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యామ్ కొట్టుకుపోవడంతో ఈ ప్రాజెక్టు మినహా అన్ని ప్రాజెక్టుల్లోకి నీరు నిల్వగా ఉంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, పీలేరు ప్రాంతంలో భారీ వర్షాలు పడడంతో బాహుద, పింఛ నదులలో వరద ప్రవాహం ప్రారంభమైంది. పింఛా ప్రాజెక్టు నుంచి చెయ్యేరు నదిలోకి 6412 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. జిల్లాలోని 11 సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థం 82 టీఎంసీలు కాగా శనివారం నాటికి ప్రస్తుత నీటి నిలువ 66.32 టీఎంసీలు. ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వ సామర్థం, ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు వివరాలు ఇలా ఉన్నాయి.

| ప్రాజెక్ట్ పేరు. | నీటినిల్వ సామర్థం. | ప్రస్తుత నిల్వ. |
|---|---|---|
| 1.గండికోట | 26.85 టీఎంసీలు | 26.24 టీఎంసీ |
| 2.వామికొండ | 1.68 టీఎంసీ | 1.34 టీఎంసీ |
| 3.సర్వారాయ | 3.06 టీఎంసీ | 1.01 టీఎంసీ |
| 4.చిత్రావతి | 10.229 టీఎంసీ | 7.92 టీఎంసీ |
| 5.పైడిపాలెం | 6 టీఎంసీ | 5.15 టీఎంసీ |
| 6.మైలవరం | 6.5 టీఎంసీ | 5.56 టిఎంసి |
| 7. ఎస్ఆర్ 1 | 2.13టీఎంసీ | 1.76 టిఎంసి |
| 8. ఎస్ఆర్2 | 2.44 టీఎంసీ | 1.96 టిఎంసి |
| 9.బ్రహ్మసాగర్ | 17.730 టీఎంసీ | 12.53 టిఎంసి |
| 10.బుగ్గవంక | 0.510 టీఎంసీ | 0.1 టిఎంసి |
| 11.వెలిగల్లు | 4.64 టీఎంసీ | 2.75 టీఎంసీ |
| 12.ఫించా. | 0.327 టిఎంసి. | 0.304 టీఎంసీ |

# వానొస్తే చాలు.. బస్టాండుకు నీరొస్తాది...

వ్యాపార సముదాయాల్లోకి చొచ్చుకు వచ్చిన నీరు... వస్తువులు తడిసి నష్టపోయామంటూన్న చిరు వ్యాపారులు

సమస్య పరిష్కారానికి కృషిచేసిన పారిశుద్ధ్య కార్మికులు... .. వర్షం కురిసిన ప్రతిసారీ పీలేరులో ఇదే



బస్టాండ్లలో షాపుల్లో వద్ద నిలుచున్న నీరు



వర్షపు నీటితో నిండుకున్న పీలేరు ఆర్టీసీ బస్టాండు

**పీలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
కాస్త వాన కురిస్తే చాలు, వర్షం నీరు వరదలా పారుతుంది. లోతట్టు ప్రాంతాలు నీటితో నిండి, చెరువులను తలపిస్తుంది. మురుగునీటి కాలువల్లో చెత్తా చెదారాలు అడ్డుపడి నీరు రోడ్లపై పొర్లుతాయి. వాహనాల రాకపోకలతో పాటు పాదచారులకు సైతం అసౌకర్యంగా మారుతుంది. ఇది ఎక్కడో సముద్ర తీరాల్లోనో లేక జీవనదుల గట్ల పక్కలోనో చోటు చేసుకుంటున్న సంఘటనలు కాదు. దినదినాభివృద్ధి చెందుతూన్న పీలేరు పట్టణంలో వర్షం కురిసిన ప్రతిసారీ స్థానిక ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులివి. పీలేరు ఆర్టీసీ బస్టాండుకు ఎగువన ఉన్న నివాస ప్రాంతాల నుంచి, వర్షం కురిసిన ప్రతిసారీ వచ్చే వర్షపు నీటితో బస్టాండు నీటి కుంటను తలపిస్తూంది. అదేవిధంగా చెత్తాచెదారాలతో మురుగునీటి కాలువలు నిండుకుని, మురుగునీరు కాస్తా పొంగి రోడ్లపై పొర్లుతుంటాయి. దీంతో అటు ఆర్టీసీ వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే ఇటు మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. మరోవైపు బస్టాండు, పరిసరాల్లోని వ్యాపార సముదాయాల్లోకి కూడా వర్షపు నీరు చొచ్చుకొస్తుండడంతో వారు పడే కష్టం, ఎదుర్కొనే నష్టం చెప్పలేనంత. సమస్య ఉన్నప్పుడు స్పందించే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆపై మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలూ వస్తున్నాయి. బస్టాండుకు చేరుతున్న వర్షపు నీరు సులభంగా అవతలి వైపుకు వెళ్లేలా పైపులైను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు భావించారు. అందుకు సంబంధించి పలుమార్లు పరిసరాలను పరిశీలించి కొలతలు కూడా తీశారు. అయితే అది కాస్తా ఆచరణకు నోచుకోకపోతుండడంతో ఆర్టీసీ వాహనాలతో పాటు ప్రయాణికులు, ఆర్టీసీ సముదాయాల్లోని చిరు వ్యాపారులు అనేకానేక ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండు పరిసరాల్లోని కొందరు వ్యాపారులు వ్యర్థాలను తీసుకొచ్చి బస్టాండు ప్రాంగణంలో నిరక్ష్యంగా పడేస్తుండడం, ఆ చెత్తాచెదారాలు గాలికి ఎగిరి ఆర్టీసీ ప్రాంగణంలోని కాలువల్లో పడి పేరుకుపోతున్నాయని, దీంతో మురుగునీరు, వర్షపు నీరు కాలువల్లో సునాయాసంగా ప్రవహించడానికి వీలుకాకుండా అవి అడ్డుపడుతున్నాయన్న వాస్తవాలూ వినిపిస్తున్నాయి. ఫలితంగా మురుగునీరు ప్రవహించడానికి ప్రత్యామ్నాయ మార్గం లేక అవి. రోడ్లపైకి పొంగి పార్లే పరిస్థితి ఏర్పడుతోందని, ఇలాంటి పరిస్థితులు ఎదురైన ప్రతిసారి కూడా గ్రామపంచాయతీ కార్మికులు వచ్చి మురుగునీటి కాలువల్లో అడ్డుపడిన చెత్తాచెదారాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టక వారికి తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టి బస్టాండు, పరిసరాల్లో వర్షపు నీరు, మురుగునీటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఆర్టీసీకి అద్దె కడుతున్నా తగిన సౌకర్యాలు సమకూర్చడం లేదు

ఆర్టీసీకి నెలనెలా అద్దెలు కడుతున్నా వారు తమకు తగిన సౌకర్యాలు సమకూర్చడం లేదని, సమస్యలు వచ్చినప్పుడు స్పందించి వాటిని పరిష్కరించడం లేదని వారు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ వ్యాపారులందరూ వారి దుకాణాల్లో చేరిన వర్షపు నీటిని, బురదను తొలగించుకోక తప్పడం లేదన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తాము పడే కష్టాన్ని, ఎదుర్కొనే నష్టాన్ని కూడా ఆర్టీసీ అధికారులు గుర్తించడం లేదని వ్యాపారులు అంటున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తమ దుకాణాల్లోకి నీరు వచ్చేసిందని, తాము పలు వస్తువులను నష్టపోయామని సంబంధిత సీఐ, బస్టాండ్ మేనేజర్లకు సమాచారం ఇవ్వడం కోసం ఫోన్లు చేసినా ఫలితం లేకుండా పోయిందని బాధను వ్యక్తం చేస్తున్నారు.

### సీఎం హామీతో రాష్ట్రస్థాయి జలవనరులశాఖ డిజైన్స్ చీఫ్

# ఇంజనీర్ ప్యాకేజీ 1 పరిశీలన

అక్విడెక్ట్ నిర్మాణం కోసం డిజైన్స్ పరిశీలన



జి ఎన్ ఎస్ ఎస్ 1 ప్యాకేజీలో ఆక్విడెక్ట్ కోసం మ్యాప్ పరిశీలిస్తున్న సిడిఓ సిఇ విజయ భాస్కర్

**రాజంపేట,అక్టోబర్4 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా పర్యటన సందర్భంగా గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా కడప వరకు నీళ్లు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో జలవనుల శాఖ అధికారులు సీఎం హామీ నెరవేర్చి దిశగా కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా జల వనరుల శాఖ సెంట్రల్స్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ విజయ, కడప జిల్లా ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ శనివారం పరిశీలించారు. జీఎన్ఎస్ఎస్ రెండో దశలో మొదటి ప్యాకేజీ పనులు పరిశీలించారు. 320 కోట్ల అంచనా వ్యయంతో 33.8 కిలోమీటర్ల దూరం ప్రధాన కాలువను నిర్మించాల్సి ఉంది. కేవలం ఒకటి. 1.2 కిలోమీటర్ల కాలువ నిర్మాణం పనులు మాత్రం జరగాల్సి ఉంది. ఇందులో అక్విడెక్ట్ నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించి డిజైన్లను పరిశీలించేందుకు వచ్చారు. దాదాపుగా డిజైన్ల పరిశీలన కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు జిల్లా అధికారులకు సూచనప్రాయంగా చెప్పారు. అలాగే రెండో ప్యాకేజీ 361 కోట్ల రూపాయలు అంచనాతో 30 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉంది .అందులో 11 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. మిగతా కాలువ నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అలాగే మూడో ప్యాకేజీని 161 కోట్ల అంచనా తో 22 కిలోమీటర్ల కాలువ నిర్మాణం చేపట్టారు. పది కిలోమీటర్ల కాలువ నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతి లభించాల్సి ఉంది. అటవీ శాఖకు 110 కోట్లు ఇందుకోసం చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్లోనే ఈ నిధులను కూడా ప్రభుత్వం కేటాయించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిని వీలైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది అందులో భాగంగానే ఉన్నతాధికారులు ఇక్కడకు వచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో అధికారుల బృందం చర్చించింది.జల వనరుల శాఖ సెంట్రల్స్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ విజయ భాస్కర్, ఎస్ ఇ శివకుమార్ ,కడప జిల్లా ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ తో పాటు జిల్లాకు చెందిన జిఎన్ ఎస్ఎస్ ఎస్ఇ కొండారెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఇ ఎం.వెంకటరామయ్య కలెక్టర్ తో చర్చించారు.



చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్

# పేదల పక్షపాతి చంద్రబాబు : జగన్ మోహన్ రాజు

**రాజంపేట,అక్టోబర్4 ప్రభాతవార్త**
ఒకవైపు పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి చేస్తూ సంపద సృష్టిస్తున్నది కూటమి ప్రభుత్వం అని రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్రాజు పేర్కొన్నారు. ప్రకృతి సంపద దోచుకునింది వైసిపి అయితే సంపద సృష్టిస్తోంది కూటమి ప్రభుత్వం అన్నారు. పేదలు వివిధ వర్గాల ప్రజలు అడగకపోయినా వారికి పథకాలు అమలు చేస్తున్న చరిత్ర చంద్రబాబుదని అందుకే ఆయన పేదల పక్షపాతి అని కొనియాడారు. శనివారం రాజంపేటలో డ్రైవర్ల సేవలో పథకాన్ని అమల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్ల వాహనాల ర్యాలీని జండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి సంబంధించిఆటో డ్రైవర్లకు1.93 కోట్ల రూపాయల మెగా చెక్కును రాజంపేట సబ్ కలెక్టర్ భావనతో కలిసి చమర్తి అందజేశారు. ఆటో డ్రైవర్ల సేవలో 436 కోట్ల మేర వారి ఖాతాల్లో జమ చేసి ఎన్నికలలో హామీ ఇవ్వని పథకం కూడా అమలు చేస్తుందని ఆటో డ్రైవర్లు గమనించాలన్నారు.ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు హామీ ఇవ్వనప్పటికీ నేడు ఆటో డ్రైవర్లకు సాయం అందించాలని మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సంకల్పం ఆయన ఉదార తత్వానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను దేశం అంతా ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. ఒకటిన్నర సంవత్సరంలోనే ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని ,రానున్న మూడున్నర సంవత్సరాలలో రాష్ట్రాన్ని నభూతో న భవిష్యత్తు అన్న విధంగా అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి , సంక్షేమ ఫలాలు చూసి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు,కూటమి నేతలు, ఆటో డ్రైవర్లు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల సుబ్బరాయుడు, డాక్టర్ సుధాకర్, సంభావు వెంకటరమణ, ఒంటిమిట్ట జెడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, గుగ్గిళ్ళ చంద్రమోళి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు చెక్ అందజేస్తున్న సబ్ కలెక్టర్ భావన, జగన్ రాజు

# సమస్యల పరిష్కారం కోసం "కూటమిపై" పోరుకు సిద్ధం

**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 04 ప్రభాతవార్త :**
విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధమని ఫ్యాప్టో నేతలు మాదన విజయ కుమార్, జి.వి.సుబ్బారెడ్డి, చింతంరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబర్ 7వ తేదీ ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పాలకవర్గాలు ఘోరంగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తుందని ఆశించారన్నారు. అప్పటి ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీల ఇచ్చారని, ఆ హామీలను నిజమని నమ్మి, కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కిస్తే, ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. తక్షణం 12వ పిఆర్సీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పిఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్



విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ సమస్యల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7వ తేదీ విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరగబోయే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ఎస్టీయూ, హెచ్ఎంఎ సంఘాల నాయకులు కె.సుధాకర్, కె.శ్రీకాంత్, ఎం.సుబ్బరాయుడు, ఎస్.దేవానందం, రమేష్ రాజా, టి.శ్రీనివాసులు, గంజి పెంచలయ్య, ఎస్.మస్తాన్ వలి, ఎద్దు జకరయ్య, వెంకటసుబ్బయ్య, పి.చక్రపాణి, మునెయ్య, లాజరయ్య, కొండయ్య, శేషాద్రి, విజయ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణమునకు విరాళం

**సుండుపల్లి, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మాచిరెడ్డిగారి పల్లె గ్రామం జరి కిందపల్లెలో వెలసి అసంపూర్తిగా ఉన్న శ్రీ శ్రీ దండు ఊరమ్మ దేవాలయ నిర్మాణము పూర్తి చేయుటకు మాచిరెడ్డిగారి పల్లెకు చెందిన ఎన్నారై నంద్యాల వెంకటరమణ (జబర్దస్త్ రమణ), కుటుంబ సభ్యులు, దండు మారెమ్మ దేవాలయానికి రూ.20వేలు విరాళం ఇచ్చారన్నారు. విరాళం ప్రకటించిన వారి కుటుంబ సభ్యులకు దండు మారెమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

## 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు మంజూరు

**పెనగలూరు అక్టోబరు 4 ప్రభాతవార్త**



మండలంలో పసుపు పోర్షన్ అభివృద్ధి కోసం ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు మంజూరు చేసిందని కాకర్ల వారి పల్లి వెటర్నరీ డాక్టరు ఎం సురేష్ తెలిపారు. ఐదు కేజీల ఎర్రజొన్నల సంచి విలువ 460 రూపాయలు కాగా 75 శాతం సబ్సిడీ పోను రైతు 115 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు రైతులు తమ గ్రామ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వద్ద సబ్సిడీ గడ్డి విత్తనాలు పొందవచ్చునన్నారు. ఈ సదవకాశాన్ని మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రతిభను ప్రోత్సహించడమే కాట్వా లక్ష్యం

**మదనపల్లె క్రైమ్ అక్టోబర్ 4 ప్రభాతవార్త.**



బలిజ, కాపు విద్యార్థుల లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా కాపు ట్రెజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాట్వా) కాట్వా నాయకులు ఎం.వి.రమణప్ప, పోతంశెట్టి రమేష్‌ను తెలిపారు. శనివారం మదనపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో జరిగిన కాట్వా సమావేశంలో ప్రతిభ చాటిన బలిజ, కాపు విద్యార్థులను సన్మానించారు. 200 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 18 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా రమణప్ప, రమేష్ లు మాట్లాడుతూ అనాథలైన విద్యార్థుల చదువుల కోసం ఫీజులు చెల్లించడానికి దాతలు సాయం తీసుకొని ఉన్నత విద్యను అభ్యసించే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. చదువుకోటానికి ఆర్థిక ఇబ్బందులు గురవుతున్న బలిజ, కాపు విద్యార్థులు కాట్వాను సంప్రదిస్తే వారికి సాయం చేయటం జరుగుతుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా కాట్వా నాయకులు రాంబాబు, పోకల మధుసూదన్ ల చేతుల మీదుగా సత్కరించారు. పదవ తరగతి ఫలితాలు 596 మార్కులు సాధించిన రెడ్డి సుదీప్ కు ల్యాప్ టాప్, 594 మార్కులు సాధించిన ప్రవీణ్ ప్రజ్ఞా రామ్ కు రూ. 10 వేల నగదు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శెట్టి వెంకటరమణ, బ్రహ్మానందం, హెడ్మాస్టర్లు శ్రీనివాసులు, నందగోపాల్, సుబ్రమణ్యం, సరస్వతి, గోపీనాథ్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులను నియమించాలి

**బద్వేలు, అక్టోబర్ 4 , ప్రభాతవార్త**
నూతనంగా నియమింపబోయే డీఎస్సీ ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు లేని గత బదిలీల్లో బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులు గల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో నియమించాలని డెమొక్రటిక్ పిఆర్టియు కడప జిల్లా అధ్యక్షుడు మానుగుంట రవిశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత బదిలీలలో బదిలీ పొందిన వారి స్థానంలో రిలీవర్ రాకపోవడంతో వారు తమ పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారనీ, సంవత్సరాలు మారుమూల ప్రాంతంలో పనిచేసి బదిలీ అయినా కొత్త పాఠశాలకు పోలేని పరిస్థితి ఉందని తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కొత్తగా ఎన్నికైన ఉపాధ్యాయులను నియమించి ఇంకా ఉపాధ్యాయులు అవసరమైన పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించి గత బదిలీలలో బదిలీ పొందిన వారిని వీలైనంత తొందరగా రిలీవ్ చేసి వారి క్రొత్తగా బదిలీ అయిన పాఠశాలకు పంపాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

### ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష

**ప్రొద్దుటూరు అక్టోబర్ 4 ప్రభాతవార్త**



దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎస్. ఇర్ఫాన్ భాషా పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి పిలుపుమేరకు ఆయన ఓటు చోర్ కు చెక్ ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజాస్వామ్య పరిరక్షణే నిజమైన దేశసేవ అని ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే ఓటు చోరీలు దేశానికి ప్రమాదకమన్నారు. ఈ కార్యక్రమంలో ఓటు దొంగ – గద్దె దిగు" అనే నినాదాలతో ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో ఓటు చోరీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరీ అప్పపోగుల ఎల్లయ్య, నాయకులు మోలాలి, ఖలందెర్, గౌస్, చెన్నూరు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముద్దనూరు,అక్టోబర్ 04 ప్రభాతవార్త:**
స్థానిక పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద శనివారం ఉదయం కొండాపురం వైపుకు వెళ్లే రైలు మార్గంలోని రైలు పెట్టాలపై తిరుమల ఎక్స్ ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని 30 సంవత్సరాల గల యువకుడు మృతి చెందాడు. స్థానికులు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే రైల్వే పోలీసులు ఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తము జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ నాగాంజనేయులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు మృతుని వివరాలు తెలియాల్సి ఉంది అన్నారు.

## అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 4, ప్రభాతవార్త**



వక్ఫ్ బోర్డ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ అలీ హెచ్చరించారు. శనివారం పట్టణానికి విచ్చేసిన ఆయన పట్టణంలోని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కోట్ల రూపాయలు విలువచేసే భూములు వక్ఫ్ బోర్డుకు ఉన్నాయని వాటిని ఎవరు అన్యాక్రాంతం చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, ఆక్రమణలు తొలగించేందుకు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బోర్డు ఇన్స్పెక్టర్, బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్అహ్మద్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

**తంబళ్లపల్లె అక్టోబర్ 4 ప్రభాతవార్త ః**



రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల ఉపశమనం కోసం వారి ఖాతాల్లో రూ 15 వేలు జమ చేసి ఆ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచినట్లు తంబళ్లపల్లె టిడిపి పరిశీలకులు దినేష్ రెడ్డి తెలిపారు. శనివారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఆటో డ్రైవర్ల దసరా కానుక లబ్ధిదారుల కార్యక్రమం స్పెషలాఫీసర్ అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి నియోజకవర్గంలో తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ దాసరి పల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు 870 మంది డ్రైవర్లకు రూ 1,30,50,000 చెక్కును అందజేశారు. తంబళ్లపల్లె ఎన్నికల పరిశీలకులు సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాన్ని సూపర్ హిట్ తో పాటు ఆటో డ్రైవర్లకు దసరా కానుకతో అండగా నిలిచిన ఘనత దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, మండల అబ్జర్వర్ రెడ్డప్ప, ఆర్టీవో శివలింగప్ప, ఏఓ థామస్ రాజా, టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, టిడిపి తులసిధర్ నాయుడు, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, క్లస్టర్ ఇన్చార్జిలు బేరి శ్రీనివాసులు, సిద్దమ్మ, ఉత్తమ రెడ్డి, కాలా నారాయణ, పురుషోత్తం, యువగళం బాలాజీ, నరసింహులు, దండువారిపల్లె రమణ, నరసింహులు నాయుడు, జైపాల్ నాయుడు, వీరాంజనేయులు, సోమశేఖర్, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నిత్య పూజ స్వామి తలనీలాల వేలం పాట

**సిద్ధవటం అక్టోబర్ 4 ప్రభాతవార్త**
లంక మల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజ స్వామి కార్తీక మాసాల తల నీలాల వేలంపాట మండల కేంద్రమైన శ్రీ రంగనాథుని ఆలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 21 నుండి నవంబర్ 20 వరకు ఒక నెలపాటు కార్తిక మాసాలు సందర్భంగా భక్తులు సమర్పించిన తల నీలాల వేలంపాట నిర్వహించామని హెచ్చు దారుడుగా జి రామకృష్ణ అనే వ్యక్తి3,30,000 పాట పాడి దక్కించుకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ జనార్ధన్ సిబ్బంది చంద్ర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ దశరథ నాయుడు నిత్య పూజేశ్వర మాజీ చైర్మన్లు జింగిటి రాజేంద్రప్రసాద్, బండి మునిరెడ్డి రంగనాథ స్వామి ఆలయ అర్చకులు రంగయ్య శాస్త్రి నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## ఆటో డైవర్ సేవలో కార్యక్రమంలో అతికారి కృష్ణ

**సిద్ధవటం అక్టోబర్ 4 ప్రభాతవార్త**



ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమంలో శ్రమజీవుల కష్టానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఏడాదికి 15వేల ఆర్థిక సహాయం అందించడంపై మండల కేంద్రమైన సిద్ధవటం బస్టాండ్ కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆటో కార్మికులు నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమహానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి చెప్పిన వాగ్దానం ప్రకారం అర్హులైన ఆటో, రిక్షా, క్యాబ్ మోటర్ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి 15 వేలు చొప్పున అందిస్తుందని కార్మికుల సమస్యల పట్ల మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కారం చేయడానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేలలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు జనసేన పార్టీ నేతలు చిన్న వెంకటయ్య, సర్పంచ్ ప్రతినిధి భవనాసి ఓబులయ్య, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా గౌస్ బాష విజయ్ పసుపులేటి గంగయ్య మాజీ విద్యా కమిటీ చైర్మన్ మునిస్వామి ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## గోవిందరెడ్డికి అభినందనలు వెల్లువ

**బద్వేల్ అర్బన్, అక్టోబర్ 4, ప్రభాతవార్త**
ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్"గా నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డిలకు పూలమాలవేసి, ఘనంగా సత్కరించారు. ఆయనకు అభినందనలు తెలిపిన వారిలో మునిసిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి,నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి,జిల్లా అధికారి ప్రతినిధి రామసుబ్బా రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు ,మాజీ స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మున్సిపల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి కేశవ రెడ్డి, మాజీమార్కెట్ యార్డ్ చైర్మన్ పుత్తాశ్రీరాములు, మాజీమార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి,వర్క్ బోర్డ్ మాజీ డైరెక్టర్ ఉమర్,మాజీ సర్పంచ్ రఘురామ రెడ్డి,ఏరియాకన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, ఏంఆర్ఎఫ్ టైర్స్ రమణారెడ్డి గుర్రంపాటి తిరుపలురెడ్డి,గుర్రంపాటి కృష్ణారెడ్డి, గుత్తల రమణయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా దస్తగిరి స్వామి జెండా పండుగ వేడుకలు

**ప్రొద్దుటూరు అక్టోబర్ 4 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులోని మట్టి మసీదు వీధిలో నివాసం ఉండే ఫ్రూట్ మర్చంట్ దస్తుమియా అండ్ సన్స్ అధినేత ఖాదర్ వలీ ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మట్టి మసీదులో జండాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి మట్టి మసీదు వీధిలో వెలసిన దస్తగిరి స్వామి దర్గాలో జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం దస్తగిరి స్వామి దర్గా దగ్గర ఉదయం 8 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు 25 వ వార్డు టిడిపి ఇన్చార్జ్ ఖాదర్‌వలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జెండా ఊరేగింపులో దస్తమియా అండ్ సన్స్ కుటుంబ సభ్యులతో పాటు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్సుల కొరత తీర్చండి

**మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**



వినతిపత్రం ఇస్తున్న బివైఎస్ నాయకులు

మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆర్టీసి రవాణా సమస్యలపై ఎదుర్కొంటున్నారని మదనపల్లె ఆర్టీసి డిపో మేనేజర్‌కు శనివారం బివైఎస్ నాయకులు పునిత్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునిత్ మాట్లాడుతూ సమయానికి బస్సుల కొరత వల్ల విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవాలని తీవ్ర ఇబ్బందులు పడుతూ, కిక్కిరిసిపోతూ ప్రమాదకరంగా పుట్‌బోర్డులపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పట్టణంలో గతంలో ఉన్న టౌన్ సర్వీస్ బస్సులను తక్షణమే పునరుద్ధరించాలని బివైఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఏపిఎస్ఆర్టీసి ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సమయాలకు అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని, పట్టణంలో పట్టణ సర్వీసును ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు జిలానిబాష, శశికుమార్, వినయ్, నాగరాజు, బాలక్రిష్ణ, దాదు, హరిక్రిష్ణ, నజీర్ బాష, జగదీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ భవితవ్యానికి మనవైఖరి ప్రవర్ధనపై అవగాహన

**మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**



కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ భవితవ్యానికి మనవైఖరి, ప్రవర్తన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ ఎంఎల్. సాయికుమార్ ఉస్మానియా యూనివర్శిటి రిసోర్స్‌పర్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రేరణాత్మక ప్రసంగంలో మంచి వైఖరి, ప్రవర్తన, వ్యక్తిత్వ వికాసం, జీవితం పట్ల సరైన దృక్పదం ఎలాం ఉండాలనే అంశాలపై వివరంగనా తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సానుకూలత, లక్ష్యసాధనలో నిబద్ధత పంపొందించాలన్న దిశగా సాగాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతికి సరనైన ప్రవర్తన, దృక్పదం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాముడు, విభాగాదిపతి డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కెరియర్‌గైడెన్స్ కోఆర్డినేటర్ ఈశ్వర్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్తీమద్యం తయారుచేస్తున్న వారిని శిక్షించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

**మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**



అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో కల్తీ మద్యం తయారుచేస్తున్న యూనిట్‌పై ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసి పట్టుకోవడం అభినందనీయమని ఇలాంటి మద్యం మాఫియాను కఠినంగా శిక్షించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తయారీ దారులను, ప్రోత్సహించేవారిని తక్షణమే బహిష్కరించాలని, కల్తీ మద్యం వల్ల పేద ప్రజలు, కష్టజీవుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు. అన్నమయ్యజిల్లాలో ఇలాంటి కల్తీమద్యాన్ని తయారు చేసే వారిని పూర్తిగా అణచివేయాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం స్పిరిట్‌తో కూడిన మద్యమని ఇలాంటి మద్యంను బెల్ట్‌షాపులు అమ్మకాలు జరుపుతున్న వారిపై కఠినంగా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యంషాపుల యజమానులు మద్యం తాపిస్తున్నారని ఇలాంటి షాపులకు లైసెన్స్‌లు రద్దు చేసి షాపు యజమానులపై కేసులు నమోదుచేయాలని లేనిపక్షంలనో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, షమీంఅస్లాంకు ఘన సన్మానం

**మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**



సన్మానిస్తున్న దృశ్యం

ఎస్ఆర్సిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మాజీ ఏపి ఎండిసి చైర్‌పర్సన్ షమీంఅస్లాంలకు సన్మానించారు. శనివారం దేశాయ్ ఫంక్షన్‌హాలులో వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమ అభినందన సభకు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, షమీంఅస్లాం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ పార్టీ తన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చి గౌరవించడం పట్ల ప్రజలకు, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయడంలో ముందుంటానని తెలిపారు. షమీంఅస్లాం మాట్లాడుతూ పార్టీలో అందరం కలసికట్టుగా రానున్న మూడేళ్ళు పార్టీకోసం శ్రమిస్తే పార్టీకి గత వైభవాన్ని తీసుకువద్దామని, కార్యకర్తలకు ఎంపి మిథున్‌రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ పార్టీలో మదనపల్లె నియోజకవర్గం అంటే జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి మితున్‌రెడ్డిలకు ప్రత్యేకమైన స్థానం,అభిమానం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎస్.రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఆవుల మల్లికార్జున, రమణారెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, సిహెచ్ రామచంద్రారెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, నర్రీబాబాయ్, కొత్తపల్లె మహేష్‌బాబు, సర్పంచ్‌లు శరత్‌రడెడ్డి, మహేష్, శారదారెడ్డి, మేరీ, నాగమణి, పాల్‌చంద్రశేఖర్, ఖాజా, ఈశ్వర్‌నాయక్, రాజేష్, ప్రసాద్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఛైర్మెన్‌ను కలసిన జనసేన నాయకులు

**నిమ్మనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
ఏపి రాష్ట్ర హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మెన్, జనసేన పార్టీ పిఏసి సభ్యులు ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట కళ్యాణ్, మండల అధ్యక్షులు ప్రదీప్‌సింగ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువకప్పి సన్మానించారు. అనంతరం మండలంలోని పలు సమస్యలు, పార్టీ విశేషాలపై మాట్లాడారు. పసుపులేటి హరిప్రసాద్‌ను కలిసిన వారిలో తోటకళ్యాణ్, మండల అధ్యక్షులు ప్రదీఫ్‌సింగ్, మండల యూత్ లీడర్ ఆఫ్రోజ్‌ఖాన్, త్రనేశ్వర్, దీపక్, రమణ, జనసేర కార్యకర్తలు కలరు.



## మండల సాధారణ సర్వసభ్య సమావేశం

**నిమ్మనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :**
మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ ఆధ్వర్యంలో 6న సోమవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహించబడుతుందని ఈ సమావేశానికి ఎంపిటిసిలు, కోఆప్షన్‌సభ్యులు, గ్రామ పంచాయితీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

## సూపర్ జి ఎస్టీ సూపర్ సేవింగ్ పై అవగాహన

**రామసముద్రం అక్టోబర్ 4 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలతో కలిసి సూపర్ జి ఎస్టీ సూపర్ సేవింగ్ లో భాగంగా శనివారం పలు దుకాణాలకు పలు వస్తువులు పైన జి ఎస్టీ తగ్గింపులు గురించి దుకాణ దారులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ వివిధ రకాల వస్తువులు పైన గతంలో ఉన్న 12 శాతం జి ఎస్టీ నుంచి 5శాతానికి తగ్గడం వల్ల ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్,గనిత, సరస్వతి, రాము, రాంమూర్తి, దుకాణ దారులు దినేష్, సత్యనారాయణ ప్రజలు పాల్గొన్నారు.

## పెన్షన్ సొమ్ము స్వాహ

**రామసముద్రం అక్టోబర్ 4 ప్రభాతవార్త**
రామసముద్రం మండలం ఆర్ నడింపల్లె గ్రామ సచివాలయం వెల్ఫే ర్ అసిస్టెంట్ అవ్వ తాతలకు అందించాల్సిన పెన్షన్ డబ్బులను దుర్వినియోగం చేశారు. ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ వివరాలు మేరకు ఆర్. నడింపల్లె సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎ.గిరి కు ఒకటో తారీఖు పెన్షన్లు పంపిణీ కోసం రూ.2.56లక్ష ్మల సొమ్ము ను అప్పగించారు.అయితే ఒకటి, రెండో తారీఖు వరకు లబిదారులకు గిరి పెన్షన్లు పంపిణీ చేయలేదు. పెన్షన్లు కోసం ఇచ్చిన డబ్బులు బెట్టింగ్ ఆడి సొమ్మును పోగుట్టు కున్నారని తెలిపారు. ఈ విషయమై లబ్ధిదారులు శనివారం మండల కార్యాలయానికి వచ్చి పిర్యాదు చేశారని అన్నారు.ఉద్యోగిని ఎంపిడిఓ ఆరాతీయగా బెట్టింగ్ ఆడి నగదును పోగొట్టినట్లు ఒప్పుకున్నారన్నారు.. ఈ ఘటనకు సంబందిచిన విషయాలను పై అధికారులకు తెలియజేసామని, వారి సూచనల మేరకు బాదితునిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అంబేద్కర్‌విగ్రహానికి నిప్పంటించిన వారిని శిక్షించాలి

**పీలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త :**



నిరసన తెలుపుతున్న దృశ్యం

పీలేరు నియోజకవర్గం కలికిరి మండలంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. చిత్తూర్ జిల్లాలోని వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు కాల్చడం దారు ణమని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శనివారం నిరసన తెలిపారు. మాట్లాడుతూ దేవళంపేట ప్రధాన కూడలిలో అంబేద్కర్ విగ్రహం ఉండడాన్ని సహించలేకే కూటమి నాయకులు కాల్చారని దుయ్యబట్టారు. దుండగులపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం ఏమిటని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మలతోటి నరేష్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి యుగంధర్, కలికిరి మండల సోషల్ మీడియా అధ్యక్షులు భానుప్రకాష్, కలికిరి మండల మహిళా కార్యదర్శి గోపమ్మ తదితరులు ఉన్నారు.

## తూముకుంటలో వైద్యశిబిరం

**గాలివీడు, అక్టోబర్ 4(ప్రభాతవార్త):**



మండలంలోని తూముకుంట గ్రామంలో అతెనా సోలార్ సంస్థ సహకారంతో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం కోసం వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు డా.జితేష్, హెల్త్ సూపర్‌వైజర్ గిరిధర్ ఆధ్వర్యంలో రక్తపోటు, చక్కెర, హీమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవసరమైన వైద్యసూచనలు అందజేశారు. మొత్తం 44 మంది గ్రామస్తులు ఈ ఆరోగ్యశిబిరం ద్వారా లబ్ది పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతెనా సోలార్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మతతత్వ మనువాద శక్తులను తరిమి కొట్టండి

**బద్వేలు ,అక్టోబర్ 4 , ప్రభాతవార్త**



డిసెంబర్ నెల 6 ,7 తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర 9వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన రాయలసీమ ఎనిమిది జిల్లాలతో కూడిన సమావేశం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరుగుతుందని, ఈ సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యులు రాష్ట్ర ఇంచార్జ్ శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగారావు, మరియు రాష్ట్ర నాయకత్వం హాజరవుతుందని అందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక పార్టీ కార్యాలయము లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్. చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జకరయ్యలు మాట్లాడుతూ...ప్రజలందరికి ఖాతాలో 15 లక్షల రూపాయిలు నల్లధనం తెచ్చి జమ చేస్తానని, సంవత్సరానికి రెండు. కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని యువతకు ఆశలు రేపి, బేటి బచావో బేటి పడావో అని మహిళలను ఆకర్పించి, ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు అనే అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఇచ్చిన నాగ్దానాలన్నీ బూటకం అని రుజువైనాయన్నారు. దేశంలో నిరుద్యోగం రాజ్యమేలుతోందని, దీని ప్రజా వ్యతిరేక విధానాల వలనే ప్రజలకి ఉపాధి కరువవుతుందన్నారు. దేశంలో గత 70 సరొంలుగా ప్రజలు కష్టపడి చేనుటోడ్చి పైసా పైసా కూడబెట్టి సంపాదించిన ఆస్తులు, స్టీల్ ప్లాంట్లు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విమానాలు, రైల్వేలు, హైవేలు, బొగ్గగనులు కలా ఒకటేమిటి సర్వసం పదలు కోటీశ్వరులకు తేరగా కట్టబెడుతున్నారు. కార్పొరేట్ కంపెనీలకు వ్యాపారం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయి అన్నారు. అందుచేత ప్రజల కళ్ళు తెరవాలి. స్వేచ్ఛ, సామానత్వం, సౌభ్రాత్వం ప్రజాసామ్యంగా తెలుపుతున్న పార్టీలు అవ్వండి. ఈ సమస్యలను ఎదుర్కొంటూ పార్టీని ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి పార్టీ 9వ రాష్ట్ర మహాసభ రాయలసీమ ప్రాంతంలో కడప పట్టణంలో జరుగుతున్నది. ఈ నేపథ్యంలో నెల 16వ తేదీ జరుగు రాయలసీమ స్థాయి సమావేశంలో రాయలసీమ సమస్యలపై చర్చించి మహాసభలో తీర్మానం చేస్తామనారు.

## ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా బైక్ జాతర

**మైదుకూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఎఫ్ఏపిటిఓ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నియోజక వర్గ ఎఫ్ఏపిటిఓ నాయకులు ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య,ఎస్టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో ఈరోజు మైదుకూరు యంఆర్సి నుండి తహసిల్దార్ కార్యాలయము వరకు బైక్ జాతర నిర్వహించడం జరిగింది.



## వైభవంగా దుర్గామాత వసంతోత్సవం



పెనగలూరు అక్టోబర్ 4 ప్రభాతవార్త

మండలం పి కొత్తపల్లి గ్రామ పరిధిలోని వినాయక నగర్‌లో నవరాత్రి పూజా కార్యక్రమాల కోసం ప్రతిష్ట చేసిన పది అడుగుల దుర్గామాత విగ్రహాన్ని వినాయక నగర ప్రజలు శనివారం వసంతోత్సవం జరుపుకొని గుంజన నదిలో నిమజ్జనం చేశారు. దసరా ఉత్సవాల కోసం హైదరాబాదు లో ప్రత్యేకంగా తయారు చేయించిన దుర్గామాత విగ్రహాన్ని 10 రోజుల క్రిందట వినాయక నగర్ లో ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలలో పూజా కార్యక్రమాలు జరిపారు. ఒక్కో రోజు ఒక్కో అవతారానికి పూజా కార్యక్రమాల నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. విజయదశమి రోజు కుంకుమ పూజ కార్యక్రమంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. శనివారం దుర్గామాత విగ్రహాన్ని ట్రాక్టర్ పై ఉంచి వినాయకనగర్ వీధులలో గ్రామోత్సవం నిర్వహించి పార్వేట కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం నర్సింగరాజపురం సమీపంలోని గుంజన నదిలో నిమజ్జనం చేశారు ఇదిలా ఉండగా ఊరేగింపులో డీజే సిస్టం మ్యూజిక్ తో యువత డాన్స్ చేసుకుంటూ ఉర్రూతలూగారు. వినాయక నగర్ లో రెండవ ఏడాది నవరాత్రి ఉత్సవాలు జరగడం విశేషం.

## ఆటో డ్రైవర్ల ఖాతాలకు రూ.15 వేలు జమ



ఆటో డ్రైవర్ల సేవలో పథకం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

పీలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ఆటో డ్రైవర్ల సేవలో... పథకం ద్వారా ఆటో డ్రైవర్ల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.15 వేలు వంతున జమ చేసినట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కూటమి శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా వారి ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దసరా కానుకగా ఆటో రిక్షా, మాక్సీక్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు "ఆటో డ్రైవర్ల సేవలో..." పథకంలో ఏడాదికి రూ.15000లు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2,90,234 మందికి ఏడాదికి రూ.435.35 కోట్లతో అర్హులైన ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరనుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఐ విజయకుమారి, ఇంచార్జ్ ఎంపీడీవో రాజేశ్వరి, ఇతర అధికారులతో పాటు పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, కూటమి నాయకులు కోటపల్లి బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఇతర కూటమి నాయకులు, అనుబంధ సంఘాలు, గ్రామ స్థాయి నాయకులు, నియోజవర్గ ఆటో డ్రైవర్లు, నల్లారి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ నడింపల్లె క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ గౌనిపల్లె జట్టు

రామసముద్రం అక్టోబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని ఆర్‌నడింపల్లె గ్రామం ఉన్న క్రీడమైదానంలో 2వ తేదీ నుంచి 04వ తేది వరకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో శనివారం ఫైనల్ మ్యాచ్‌లో ఆర్ నడింపల్లె జట్టు, కర్ణాటక రాష్ట్రం గౌనిపల్లె జట్టులు పోటా పోటీగా ఆడిన ఈ మ్యాచ్‌లో విన్నర్స్‌గా గౌనిపల్లె జట్టు విన్నర్స్ నిలచాగా ఆర్ నడింపల్లె జట్టు రన్నర్స్ నిలిచింది ఈ టోర్నమెంట్ విన్నర్స్ కు 25,116 జడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి రన్నర్స్ కు ఆర్ నడింపల్లె యూత్ 15,116 మూడవ బహుమతి సి. మహేష్,10,116, నాలగవ బహుమతి వేణు, వలీ 5116 వితరణ చేశారు. టోర్నమెంట్ ట్రోఫి డాక్టర్ సోమశేఖర్ వితరణ భోజన సదుపాయం కిట్టప్ప, మధు, శివకుమార్ నిర్వహించారు. జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి, ఆర్ నడింపల్లె పెద్దలు,యూత్ బహుమతులు ప్రధానం చేశారు ఈ సందర్బంగా జడ్పీటీసీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ లో టీమ్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి విన్నర్స్,రన్నర్స్ గా గౌనిపల్లె, ఆర్. నడింపల్లె జట్లు నిలిచిన విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్ల క్రీడాకారులను అభినందనలు తెలుపుతున్నా. ఆర్. నడింపల్లె టోర్నమెంట్ నిర్వాహుకులు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ నిర్వహించేందుకు సహకరించిన ఆర్ నడింపల్లె యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి నెల గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి



పీలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త:

నూతన కలెక్టర్‌గా నిశాంత్ కుమార్ బాధ్యతలు చేపట్టడంతో శనివారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బండ కింద మనోహర్, సత్యాల రామ కృష్ణ, జి .వెంకటరమణ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ గారితో వీరు మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల నిమిత్తం నెలలో ఒకరోజు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అదే విధంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు కాంపొజేషన్ సకాలంలో అందడం లేదని మరియు జిల్లాలో పలు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు మరియు పౌర హక్కుల దినోత్సవం సివిల్ రైట్స్ డే నిర్వహించడం లేదని తెలియజేయడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈనెల 8వ తేదీన జరిగే జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారని వీరు తెలిపారు.

## ఏఆర్‌డీఎస్పీ బాధ్యతలు చేపట్టిన పి.నాగేశ్వరరావు

కడప క్రైం, అక్టోబరు 4, ప్రభాతవార్త:



నూతన ఏఆర్‌డీఎస్పీగా పి.నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. 1996 సంవత్సరం లో ఆర్‌ఎస్సైగా ఉద్యోగ ప్రస్తానాన్ని ప్రారంభించి విశాఖపట్నం రూరల్ విజయనగరం తదితర జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. 2010లో ఆర్ఐగా పదోన్నతి పొంది విజయనగరం పీటీసీ విశాఖ పట్నంలో పని చేశారు. 2022లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. అనకాపల్లిలో ఏఆర్‌డీఎస్పీగా విధులు ఎనిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీపై వచ్చారు.

# శ్రీవారి భక్తులకు అన్న ప్రసాదం





బద్వేల్ అర్బన్ అక్టోబర్ 04 ప్రభాతవార్త :

పట్టణంలోని నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఈవో రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారి రమేష్ స్వామి, స్వామివారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనతోపాటు విశేష పూజలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులందరికీ శ్రీ సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్ట్నర్స్ యజమాని పత్తి రాజా గారి కృష్ణమూర్తి సతీమణి కళావతి కుటుంబ సభ్యుల సహకారంతో శ్రీవారి భకులకు అన్నప్రసాదం గావించాకె, ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ భక్తాదులందరికీ అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు, ఈ కార్యక్రమంలో కొవ్వూరు వెంకట నారాయణ రెడ్డి, ఊరుబిండి జయరామి రెడ్డి, జొన్నలగడ్డ శ్రీధర్, గాజులపల్లె కేశవరెడ్డి,వాకచర్ల తిరుపాలయ్య, బసిరెడ్డి రమణారెడ్డి ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్య తో పాటు మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ సతీమణి వసంతలక్ష్మి, బిన్నీ, సాయి, పబ్బతి సత్యనారాయణ సతిమని హైమావతి, మెంటా ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, కొప్పరపు సురేష్ బాబు సతీమణి బాల సరస్వతి, పబ్బతి హజరత్, ఆర్యవైశ్య వర్తక సంఘం ఉపాధ్యక్షులు దర్శి సుబ్బ రాజా, మాలేపాటి సుధాకర్,మురళి సతీమణి శివమ్మ పాల్గొన్నారు.

# ప్రజా రవాణా వ్యవస్థలో ఆటోడ్రైవర్ల పాత్ర కీలకం

మదనపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

గ్రామాలు, పట్టణాల ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మదనపల్లెలోని కేఎస్ ఆర్ పంక్షన్‌హాలులో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ కళ్యాణిలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు రూ.15వేలు ఆర్ధికసాయం అందించడంలో భాగస్వామ్యం కావడం చాలా అనందంగా ఉందన్నారు. విద్యార్థి దశలో ఆటో డ్రైవర్లతో ఏర్పిడిన భావోద్వేగబంధాన్ని తాను మరిచిపోలేనని గుర్తు చేసుకొన్నారు. పట్టణాల్లో సేవలు అందించడమే కాకుండా గ్రామాలను, పట్టణాలను కలిపే కీలకమైన పాత్రను ఆటో డ్రైవర్లు పోషిస్తున్నారన్నారు. తాను సివిల్స్ రాసేటప్పుడు, ఇంటర్వ్యూలకు వెళ్ళేసమయంలో ఆటోలో వెలుతుండగా తన ఆందోళనను ఆటో డ్రైవర్లు గుర్తించి మానసికంగా ధైర్యాన్ని ఇచ్చేవారనన్నారు. ఆటోడ్రైవర్లకు అందించే రూ.15వేలు ఆర్థికసాయాన్ని వారి కుటుంబాల అభివృద్దికి వినియోగించుకోవాలని సూచించారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంనగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8835 మంది లబ్దిదారులకు రూ.13.25కోట్లు జమ అవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మాత్రమే ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం సూపర్‌సిక్స్ పథకాల్లో లేదని అయినా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాన్‌లు ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. మంత్రి నారాలోకేష్ విద్యావ్యవస్థలో మార్పులు తెచ్చారన్నారు. సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద రూ.15వేలను అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, రవాణశాఖ అధికారులు, సిబ్బంది, నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్ వాల్మీకిపురం క్రీడాకారుడు దీపన్ సాయినాథ్

వాల్మీకిపురం/ పీలేరు అక్టోబర్ 4 ప్రభాతవార్త :



ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌లో వాల్మీపురం GVSCS గ్రౌండ్ లో తిదితి ఉమ్మడి చిత్తూర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న subcenter క్రికెట్ camp నుండి సెలెక్ట్ అయనట్లు cdca హెడ్ కోచ్ బి. సునీల్ కుమార్ తెలిపారు. దీపన్ సాయినాథ్ లెఫ్ట్ హ్యాండ్ స్పిన్ బౌలర్ మొదట చిత్తూరు జిల్లా కి సెలెక్ట్ అయి తరువాత సౌతజోన్ మంచి పెర్ఫార్మన్స్ చేసి స్టేట్ ప్రాబబుల్స్ ఉత్తమ పెట్పార్మన్స్ చేసి ఆంధ్ర రంజీ క్యాంపు సెలెక్ట్ అయనట్లు తెలిపారు. ఇప్పుడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం ఆంధ్ర క్రికెట్ అకాడమీలో న్యూజీలాండ్ నుంచి వచ్చిన మరియు ఆంధ్ర కోచ్ లు పరివేక్షణలో క్యాంపులో ఉన్నట్లు తెలిపారు 12 సంవత్సరాలు నుండి VCC!!GVSCS మరియు cdca- sub-center ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకొనట్లు తెలిపారు వాల్మీకిపురం మరియు మదనపల్లి జోన్ నుండి మొదటి సారి సెలెక్ట్ అయనట్లు తెలిపారు ఈ ఎంపిక పట్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బి. విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్ ) ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ లీ. సతీష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వాల్మీకిపురం చెందిన బి శ్రీధర్ కుమార్, హెడ్ కోచ్ బి. సునీల్ కుమార్ మరియు cdca సభ్యులు, vcc!!gvscs సభ్యులు, సీనియర్ క్రీడాకారులు వాల్మీకిపురం వాసులు హర్షం వ్యక్తం చేసారు.

## ఐకమత్యానికి నిదర్శనం గ్యార్వి పండగ



బద్వేల్ అర్బన్ అక్టోబర్ 04 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి మహబూబ్ నగర్ వీధిలో వెలిసిన హజరత్ శ్రీ శ్రీ శ్రీ మహబూబ్ సుభాని దస్తగిరి స్వామి వారి దర్గా (నిశాన్) వద్ద శనివారం గ్యార్వి పండుగను ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు, దస్తగిరి స్వామి వారిని దర్శించుకున్న పలువురు ముస్లిం సోదరులకు ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గంధం మహోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, గంధం మహోత్సవం వెంబడి స్వామి వారి జండాలతో ప్రత్యేక బ్రాండ్ మేళ తాళాల మధ్య పలువురు గంధం మహోత్సవాన్ని తీసుకువెళ్లడం జరిగింది, ఐక్యమత్యానికి నిదర్శనంగా గ్యార్వి పండగను జరుపుకోవడం జరుగుతుందని గవర్నమెంట్ ఖాజి షఫీ అహ్మద్ 13వ వార్డు టిడిపి ఇన్చార్జ్ ఎస్ఎండి హుస్సేన్ (కాట్రాజ్) వార్డు నాయకులు రంగయ్య మరియు దర్గా కమిటీ సభ్యులు దాదాపీర్, మస్తాన్, హుస్సేన్ పీరా, అజ్మతుల్లా, ఖాజావల్లి, హాటేలి, సలీం, మరియు 13,వవార్డ్ కౌన్సిలర్ హాసన్ పలువురు పాల్గొన్నారు.

## రీ సర్వే పై రైతులకు అవగాహన

దువ్వూరు, అక్టోబర్ 04, ప్రభాతవార్త:

రాష్ట్రంలో చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా మండలంలో 3వ విడత చిన్నసింగన పల్లె, పెద్ద జొన్నవరం గ్రామాల్లో రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు తహసిల్దార్ సంజీవరెడ్డి తెలిపారు. చిన్న సింగనపల్లె గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన రీ సర్వే పై మాట్లాడుతూ రైతులు దగ్గర ఉండి తమ పొలాలను రీ సర్వే చేయించుకోవాలన్నారు. రైతులు పొలం వద్ద ఉంటే సర్వే అధికారులు వచ్చి కొలతలు వేస్తారని, ఎక్కువ తక్కువలు అనేటు వంటివి ఉంటే అక్కడే పరిష్కారం అవుతాయన్నారు. రైతులు తమ పొలాల వద్దనే ఉండి సర్వే అధికారులతో రీ సర్వే చేయించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మూడవ విడతలో భాగంగా వీటిని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ కరీముల్లా, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



## వాహన మిత్ర పథకం ఆటో డ్రైవర్లకు వరం

### టిడిపి నియోజకవర్గ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



రాయచోటి అక్టోబర్ 4 ప్రభాతవార్త

వాహన మిత్ర పథకం ఆటో డ్రైవర్లకు ఓ వరం అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు నియోజకవర్గపు నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు రాయచోటిలో శనివారం రాష్ట్ర క్రీడలు మరియు రవాణా శాఖల మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాలతో వాహన మిత్ర పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా టిడిపి నాయకుడు మండపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభు త్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మొత్తం 436 కోట్లు ఖర్చు చేసి అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరు తుందని హామీ ఇచ్చారు.అర్హత లేని వారు నిరాశ చెందవద్దని సూచిస్తూ, ప్రజలతో ఎల్లప్పుడూ చంద్రన్న ప్రభుత్వం ఉంటుందని అన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 1875 మంది లబ్దిదారులు ఎంపిక అయ్యారని, ఇంకా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో పాలయేకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు కుప్పం పరిశీలకులు గాజులు కా దరా బాషా డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, దుద్యాల కోటిరెడ్డి,టిడిపి నాయకులు మరియు కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాళహస్తీస్వర బోర్డు పాలకమండలి సభ్యురాలుగా కల్లె. సావిత్రి

సుండుపల్లె, అక్టోబర్04, ప్రభాతవా ర్త:



శ్రీ కాళహస్తీస్వర ఆలయ పాలకమండలి సభ్యులుగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కల్లె రెడ్డెప్ప సతీమణి కల్లె సావిత్రి ని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.సుండుపల్లె మండలం ముదుంపాడు గ్రామం గోపాలకృష్ణాపురం కు చెందిన కల్లె రెడ్డెప్ప మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా పార్టీ అభివృద్ధికి సేవ చేశారు.తెలుగుదేశం పార్టీ మహిళా కోటాలో ఆయన సతీమణి కల్లె సావిత్రిని శ్రీ కాళహస్తీ ఆలయ పాలకమండలి సభ్యురాలుగా నియమించారు.దీంతో తెదేపా నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా అందించడమే ధ్యేయం

బద్వేలు, అక్టోబర్ 4, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనని అందులో భాగంగా ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆర్థికంగా వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో భాగంగా పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపం వద్ద నుండి ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ బివిఆర్ డిగ్రీ కాలేజ్ ఆడిటోరియంలో రితేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఒక్కొక్క ఆటో డ్రైవర్ ఖాతాలో 15000 జమ కావడంతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని,ఆటో డ్రైవర్ల సమస్యలపై మాట్లాడుతూ ఫిట్ నెస్ సర్టిఫికెట్ల కోసం కడపకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని నా దృష్టికి వచ్చింది ,ఈ సమస్యను మన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి బద్వేల్ లోనే ఆర్టీవో ఆఫీసు సేవలు కొనసాగే తట్టు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్టీవో చంద్రమోహన్ మాట్లాడుతూ బద్వేల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ప్రతి ఒక్క లబ్ధిదారునికి 15,000/ చొప్పున బద్వేల్ నియోజకవర్గంలో ఉన్న 1268 మంది ఆటో డ్రైవర్లకి.1,90,20,000/ వారి ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో స్టేట్ ఖాది మరియు గ్రామ ఉద్యోగ సమాఖ్య చైర్మన్ కేకే చౌదరి , డిఎల్డివో,బద్వేల్ శేషయ్య , కూటమి పార్టీ ముఖ్య నాయకులు బిజెపి పార్లమెంట్ సభ్యుడు బొమ్మన సుబ్బరాయుడు, బొజ్జ రాజన్న, తుడిమెల్ల మురళి, బలిజ సేవా సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, వెంగళరెడ్డి, , రాగిమాను ప్రతాప్ కుమార్,నరసింహానాయుడు, జహంగీర్ భాష, వడ్లపూటి నాగభూషణం, మరియు రవాణా మరియు పోలీస్ పాల్గొన్నారు.



దేవి శరన్నవరాత్రుల వేడుకల నిర్వహణలో

## పోలీసుల పనితీరు అభినందనీయం..

ప్రొద్దుటూరు అక్టోబర్ 4 ప్రభాతవార్త



ప్రొద్దుటూరులో వైభవంగా జరిగిన దేవి శరన్నవరాత్రులతో పాటు విజయదశమి వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటంలో పోలీసులు చేసిన కృషి అభినందనీయమని టిడిపి మాజీ ఇంచార్జి డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి కొనియాడారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోనే దసరా ఉత్సవాల నిర్వహణ లో ప్రొద్దుటూరు రెండవ మైసూరుగా ప్రసిద్ధి చెందిందన్నారు. పది రోజుల పాటు అంగరంగ వైభవంగా దేవి శరన్నవరాత్రులు జరిగిన నేపథ్యంలో ప్రొద్దుటూరు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో స్థానిక డిఎస్పి పూతి భావన ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ప్రధానంగా డి.ఎస్.పి పుతి భావన నిత్యం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు ఇస్తూ శాంతిభద్రతలను కాపాడడంలో ఆమె కృషి అభినందనీయమన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముగ్గురు టిడిపి నాయకుల పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, అలాంటి వ్యాఖ్యలు చేసినా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పోలేదని అందుకు నిదర్శనమే మాజీ ఎమ్మెల్యే రాచమల్లుపై చర్యలు తీసుకోకపోవడమేనన్నారు. అదే వైసిపి పాలనలో అలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడే వారని విమర్శించారు. ఇప్పటికైనా నీతి నిజాయితీగా పనిచేసే పోలీసు అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి ప్రొద్దుటూరులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో టిడిపి యువ నాయకులు భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకం అమలుతో ఉపాధి కోల్పోతున్న

## ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం



ప్రొద్దుటూరు అక్టోబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ఇచ్చినట్టు అమలు చేస్తున్న క్రమంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు వల్ల తమ ఉపాధిని కోల్పోతున్న ఆటో డ్రైవర్ల పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి సంవత్సరం 15వేల ఆర్థిక సహాయం అందించి వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఆటో డ్రైవర్ల సేవలో అనే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రాన్ని అగాధంలోకి నెట్టిన వైసీపీ పాలనకు చరమగీతం పాడి టిడిపి జనసేన బిజెపిల కూటమికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు ఓటమి ప్రభుత్వానికి గద్దెనెక్కించిన సంగతి తెలుసన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్ల పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు వారికి అండగా నిలవాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు అందులో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్ కు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం వారికి ఊరట కలిగిస్తుందన్నారు. ప్రజలకు చెప్పినవి చెప్పినట్టుగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ జీఎస్టీ ని ప్రకటించి అన్ని రంగాల వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చిందన్నారు. ప్రతి రంగంలో సూపర్ జీఎస్టీ వల్ల ధరలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిత్త రవిచంద్రా రెడ్డి ప్రత్యేక అధికారి ఓబులమ్మ టిడిపి నాయకులు వీఎస్ ముక్తి ఆర్ ఈవి సుధాకర్ రెడ్డి వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్ల బోతుల నాగరాజు టౌన్ బ్యాంకు అధ్యక్షులు బొగ్గుల సుబ్బారెడ్డి లింగాపురం సొసైటీ అధ్యక్షులు నాగముని రెడ్డి బిజెపి పట్టణ అధ్యక్షులు వంకధార నరేంద్రరావు జనసేన నాయకులు ఎస్ జిలాని మరియు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

కడప క్రైం, అక్టోబరు 4, ప్రభాతవార్త:

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర బీసీ శాఖామంత్రి ఎస్.సవితమ్మను పులివెందులలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చారు.




వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

కడప జిల్లా: బద్వేలు రూరల్, పోరుమామిళ్ల, కొండాపురం, లింగాల, సికెదిన్నె, అట్లూరు

అన్నమయ్య జిల్లా: బి.కొత్తకోట, వీరబల్లి, పిటిఎం, కలకడ, వాయల్పాడు, రైల్వేకోడూరు, పుల్లంపేట, నందలూరు

ఇంటర్వ్యూ తేది : 11.10.2025

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086